క్లుప్తంగా

డిప్యూటీ మేయర్ జియ్యాని వార్డు పర్యటన



పార్కులో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డులో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ శుక్రవారం పర్యటించారు. వార్డులోని పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, కళావేదిక పనులను పరిశీలించి, అధికారులతో సమీక్షించారు. వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఆయనతో పాటు ఏఈ ఉషారాణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మూర్తి, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అక్కినేనికి ఘన నివాళి



అక్కినేని విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న అభిమానులు

మల్కాపురం: ప్రముఖ సినీ నటుడు దివంగత అక్కినేని నాగేశ్వరరావు 101వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 61వ వార్డు ప్రాంతానికి చెందిన ఆల్ ఇండియా ఏఎన్ఆర్, నాగార్జున, నాగచైతన్య అభిమానుల సంఘం ఉపాధ్యక్షుడు చట్టి నూకరాజుయాదవ్‌తో పాటు పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు అభిమానులు హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోకి వెళ్లి, అక్కడున్న అక్కినేని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అక్కినేని నటించిన తొలి చిత్రం నుంచి చివరి చిత్రం వరకు నటించిన ఫొటోలతో కూడిన ఆల్బమ్‌ను అభిమానులకు అందించారు.

భారీ అన్నసమారాధన



భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు

సింథియా: వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 62వ వార్డులోని గుడివాడ అప్పన్నకాలనీలో శుక్రవారం ఏర్పాటు చేసిన అన్నసమారాధనను కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చవితి ఉత్సవాల్లో అనవసర ఖర్చులు చేయకుండా పేదల కడుపు నింపే అన్నదానాలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు బీశెట్టి గణేష్, స్థానిక నాయకులు మసేనమ్మ, శ్రీను, ఉత్సవ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


'విశాఖ' కళాశాలలో స్వచ్ఛతా హీ సేవ



స్వచ్ఛతా హీ సేవలో విద్యార్థులు, అధ్యాపకులు

గోపాలపట్నం: నరవలోని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రధాని మోదీ ప్రవేశ పెట్టిన స్వచ్ఛభారత్ మిషన్ పదేళ్లు పూర్తయిన సందర్భంగా కళాశాల విద్యార్థులు ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. ప్లాస్టిక్ వస్తువులు, చెత్తను సేకరించి జీవీఎంసీ సిబ్బందికి అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీ ప్రదీప్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి చిట్టిమిరెడ్డి వీరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇది వంచన ప్రభుత్వం





దుర్గాపురం గ్రామం

పశ్చిమ నియోజకవర్గంలో సమస్యలు తిష్టవేశాయి. ఎన్నికల సమయంలో వీధివీధికీ వెళ్లి స్థానిక సమస్యల పరిష్కారానికి హామీలు గుప్పించిన ఎమ్మెల్యే గణబాబు గెలిచాక వాటిని పట్టించుకున్న పాపానపోవట్లేదని ప్రజలంటున్నారు. దీంతో ఏళ్ల తరబడి సమస్యలు పరిష్కారానికి నోచుకోక, తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. అయినప్పటికీ ఈ వంద రోజుల పాలనలో తామేదో గొప్పగా చేసేసినట్లు ప్రచారం చేసుకోవడంపై ప్రజలు నవ్వుకుంటున్నారు. ప్రజల సమస్యల్ని పట్టించుకోని ఈ ప్రభుత్వం మంచి ప్రభుత్వం కాదు.. వంచన ప్రభుత్వం అంటూ ఆక్షేపిస్తున్నారు.

- వంద రోజులు దాటిన కూటమి ప్రభుత్వ పాలన
- సమస్యలపై దృష్టి సారించని ఎమ్మెల్యే
- అపరిష్కృతంగా దీర్ఘకాలిక సమస్యలు

గోపాలపట్నం/మల్కాపురం: పశ్చిమ నియోజకవర్గంలో ఏ వార్డు/గ్రామం చూసినా అపరిష్కృత సమస్యలు కోకొల్లలు. ఎమ్మెల్యేగా గణబాబు చేసిందేమీ లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో గొప్పగా చెప్పి, బాండ్లు కూడా ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలకే దిక్కులేనపుడు, స్థానిక సమస్యల గురించి పట్టించుకునేదెవరని ఆక్షేపిస్తున్నారు.

అపరిష్కృత ప్రధాన సమస్యలు

- 57వ వార్డు దుర్గాపురంలో ఇళ్ల పట్టాల సమస్య అలానే ఉంది. రోడ్డు సమస్య తీరలేదు. నేవీ అధికారులు గ్రామానికి వెళ్లేందుకు కాస్త దారి వదిలి, చుట్టూ గోడ కట్టేశారు. మరో వైపున రైల్వే స్థలం, మూడో వైపున పోర్టు స్థలం. దీంతో వీరు కారాగారంలో ఉన్న పరిస్థితి.
- 92వ వార్డు పరిధి పద్మనాభనగర్, మేహాద్రిగెడ్డ, కంపరపాలెం తదితర గ్రామాల్లో ఇళ్ల పట్టాలున్నా రిజిస్ట్రేషన్ చేసేందుకు వీల్లేదు. మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నిర్మాణ సమయంలో కొన్ని గ్రామాలను తొలగించారు. నిర్వాసితులకు ఇక్కడ స్థలాలిచ్చారు. హౌసింగ్ శాఖ ద్వారా ఇళ్ల నిర్మాణానికి రుణాలు కూడా మంజూరు చేశారు. అవసరానికి అమ్ముకోవాలంటే మాత్రం వీల్లేని స్థితి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తగు పరిష్కారం కోసం కలెక్టర్‌ను ఆదేశించారు. కూటమి ప్రభుత్వంలో ఆ ప్రతిపాదనలూ మూలకు చేరాయి. దీంతో 500 కుటుంబాలు బతుకులు అయోమయంలో ఉన్నాయి.
- జీవీఎంసీ 90, 91, 92 వార్డుల్లో విస్తరించి ఉన్న కొండవాలు ప్రాంతంలో కొండ చరియలు విరిగిపడి నివాసితులు ప్రమాదాలకు గురవుతున్నారు. రక్షణ గోడ నిర్మించాలన్న దీర్ఘకాలిక డిమాండ్ అమలుకు కనీస చర్యల్లేవు.
- హెచ్‌పీసీఎల్(విశాఖ రిఫైనరీ), కోరమాండల్ పరిశ్రమల నుంచి నిత్యం వెలువడే కాలుష్యం కారణంగా సమీప నివాసులు దీర్ఘకాలిక రోగాల బారిన పడుతున్నారు. కాలుష్య నియంత్రణకు ఆయా సంస్థల యాజమాన్యాలతో సంప్రదించి, చర్యలు తీసుకోవాలన్న స్థానికుల మొరను పట్టించుకోవట్లేదు.
- భారీ పరిశ్రమల కోసం భూములు ఇచ్చిన వారికి గానీ, స్థానిక నిరుద్యోగులకు ఆయా పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు ఉండట్లేదు. దీనిపై హామీలు గుప్పించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా.. అమలుపై దృష్టి సారించట్లేదు.
- సింథియా నుంచి జింక్ వరకు ఉన్న ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవటంతో తోపుడుబండ్ల వ్యాపారులు రోడ్లను ఆక్రమిస్తున్నారు. సాయంత్రమైతే నిత్యం ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.
- డాక్‌యార్డ్ వంతెన మార్గం మూసేయడంతో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన వాహనదారులు ములగాడ మీదుగా శ్రావణ్ షిప్పింగ్‌ను దాటుకుని గుంతల మయంగా ఉన్న సర్వీస్ రోడ్డులో రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఈ వంతెనకు త్వరితగతిన మరమ్మతులు చేపట్టి, వాహన రాకపోకలకు అనుమతించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధి కల్పించాలి



స్థానిక పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి కల్పించాలి. ఈ పరిశ్రమల నుంచి వస్తున్న కాలుష్యంతో మల్కాపురం, శ్రీహరిపురం తదితర ప్రాంత వాసులు అనారోగ్యానికి గురవుతున్నారు. దీనిపై అధికారులు, పాలకులు దృష్టి సారించాలి.

– ఆదారి హరీష్, శ్రీహరిపురం

ఇళ్ల పట్టాలివ్వాలి



దుర్గాపురం సమస్య చాలా ఏళ్లుగా ఉంది. అందరి నాయకుల చుట్టూ, అధికారుల ఉట్టూ తిరిగాము. ఇక్కడ ప్రధానంగా ఇల్ల పట్టాలు అందివ్వాలి. రహదారి అవకాశం కల్పించాలి. ఎమ్మెల్యే మా సమస్యను పరిష్కరించాలి

– హేమలత, దుర్గాపురం

డాక్‌యార్డ్ వంతెన తెరవాలి



డాక్‌యార్డ్ సమీపంలోని వంతెన మార్గం తెరిపించాలి. చుట్టు తిరిగి వచ్చేందుకు చాలా ఇబ్బంది పడాల్సి వస్తోంది. మల్కాపురం శివారునున్న పోర్టు భూముల్లో క్రీడా మైదానం, ప్రజలకు ఉపయోగపడే నిర్మాణాలు చేపట్టాలి.

– సర్వసిద్ధి పైడిబాబుయాదవ్, మల్కాపురం

శాశ్వత హక్కులు కల్పించాలి



కంపరపాలెం, పద్మనాభనగర్, మేహాద్రిగెడ్డ కాలనీల్లోని దీర్ఘకాలికంగా సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. వీటిపై ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా నాయకులు పట్టించుకోవట్లేదు. మేం ఉంటున్న ఇళ్లపై శాశ్వత హక్కులు కల్పించాలి.

– కంపర రామకృష్ణ, కంపరపాలెం

'సంక్షోభంలోనూ సంక్షేమం అందించాం'



కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలన గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

సింథియా: సంక్షోభంలోనూ సంక్షేమం అందించి, అభివృద్ధికి రెక్కలు తొడిగి వంద రోజుల్లోనే ఇది మంచి ప్రభుత్వం అని ప్రజల చేత అనిపించుకున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీ కాలనీలో శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజుల కూటమి ప్రభుత్వ పరిపాలనలో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు, రూ.5కే పేదల ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్ల ప్రారంభం, పెన్షన్ల పెంపు, మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కూటమి ప్రభుత్వంలోనే జరిగిందన్నారు. భవిష్యత్తులో మరెన్నో ప్రజారంజక పథకాలతో పేదలకు అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో 40వ వార్డు టీడీపీ అధ్యక్షుడు గేదెల రమణ, డీఈ ఏడుకొండలు, ఏపీడీ చిరంజీవి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేద్దాం



కొత్త, పాత జెడ్సీలు రాము, కృష్ణలను సత్కరిస్తున్న జోనల్ అధికారులు

కంచరపాలెం: జీవీఎంసీ జోనల్ కార్యాలయ సిబ్బంది అందరం సమష్టిగా కలిసి పనిచేద్దామని జోన్–5 నూతన కమిషనర్ బొడ్డేపల్లి రాము కోరారు. జ్ఞానాపురం జోనల్ కార్యాలయంలో శుక్రవారం జెడ్సీగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జోన్ పరిధిలో సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రజాప్రతినిధులతో కలిసి వార్డుల్లో పర్యటిస్తానని తెలిపారు. విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు. సంబంధిత శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ముందుగా ఆయా శాఖల అధికారులు జెడ్సీ రామును సత్కరించారు. అనంతరం పాత జెడ్సీ ఆర్.జీ.వి.కృష్ణకు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో రెవెన్యూ కమిషనర్ బాబూరావు, రాజ్యలక్ష్మి, విజయలక్ష్మి, టౌన్ ప్లానింగ్ ఏసీపీ కె.వెంకటరావు, ఇంజినీరింగ్ ఈఈలు తారా ప్రసన్నరెడ్డి, మత్స్యరాజు, ఏడుకొండలు, ఏపీడీలు పద్మావతి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు



డ్రైడే–ఫ్రైడేపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధిలోని త్రినాథపురంలో శుక్రవారం డ్రైడే–ఫ్రైడే నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా మలేరియా విభాగం హెల్త్ సూపర్‌వైజర్ సూర్యనారాయణ, మల్కాపురం మలేరియా నివారణ ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి ప్రాణాంతక వ్యాధుల నిర్మూలనకు తీసుకోవాలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కలిగించారు. ప్రతి శుక్రవారం, మంగళవారం ఇంట్లో అత్యవసరానికి కావలసిన నీటిని ఉంచుకుని, మిగిలిన నీటి పాత్రలను ఖాళీ చేస్తే, సీజనల్ వ్యాధికారక దోమల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ప్రజలు తడి–పొడి చెత్తను ఇంటివద్దే వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించాలని కోరారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులను దూరం చేయవచ్చన్నారు. చిన్నపిల్లలు, వృద్ధుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏ చిన్న అనారోగ్య సమస్య తలెత్తినా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా విభాగం హెల్త్ అసిస్టెంట్ రోమాల వేణుబాబు, సూపర్‌వైజర్ దుల్లా శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు జయలక్ష్మి, డ్వాక్రా ఆర్పీ ధనలక్ష్మి, మలేరియా సిబ్బంది రత్నం, డి.రామారావు, డి.సంతోషి, బంగారు జ్యోత్స్న, జీవీఎంసీ, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక ఊసే లేదు.. వంద రోజుల పండగా?



లేబర్ జంక్షన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు

మల్కాపురం: ఎన్నికలలో గెలిచిన వెంటనే ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చిన కూటమి పాలకులు ఆ హామీనే మరిచారని భవన నిర్మాణ కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షుడు కె.పెంటారావు ఆక్షేపించారు. ఉచిత ఇసుక ఊసు లేదుగానీ.. ఏదో ఘనకార్యం సాధించినట్లు వంద రోజుల పండగ పేరిట హడావుడి చేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. మల్కాపురం సీఐటీయూ జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఇసుక కొరత, భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై 59వ వార్డు నెహ్రూనగర్ వద్దనున్న లేబర్ జంక్షన్‌లో శుక్రవారం భవన నిర్మాణ కార్మికులతో కలిసి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన ఎన్నికల్లో చంద్రబాబు ఉచిత ఇసుక పేరిట భవన నిర్మాణ కార్మికులను నమ్మించి ఓట్లు గుంజుకుని, గెలిచాక ఆ వాగ్దానాన్ని విస్మరించారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం వచ్చి వంద రోజులైనా ఇసుక అందుబాటులో లేక, నిర్మాణాలు జరగక భవన నిర్మాణ కార్మికులు, బిల్డర్లు, గృహ యజమానులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబును నమ్మి ఓట్లు వేసినందుకు తగిన ఫలితం దక్కిందని వాపోయారు. భవన నిర్మాణ కార్మికులను మోసం చేసిన ఏ ప్రభుత్వం చరిత్రలో నిలవలేదన్నారు. ఎన్నికల సమయం వరకు ఒక మాట, గెలిచాక మరో మాట చెప్పటం చంద్రబాబు నైజమని మండిపడ్డారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇసుక సమస్యపై స్పందించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమంపై దృష్టిసారించి, లేబర్ కార్డులను మంజూరుచేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జోన్ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, భవన నిర్మాణ కార్మికుల సంఘం ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

గాయపడ్డ కుక్కకు చికిత్స



రోడ్డుపైన కుక్కకు వైద్యం అందిస్తున్న వెటర్నరీ డాక్టర్ చరణ్

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధి క్రాంతినగర్‌లో ఆటో ఢీకొని గాయపడి కొన ఊపిరితో కొట్టుకుంటున్న కుక్కకు ప్రభుత్వ వెటర్నరీ వైద్యుడు చరణ్ వైద్యం అందించి, భూతదయ చాటుకున్నారు. 1962 వాహనంలో విధులు నిర్వహిస్తున్న ఆయన గాయాలతో ఉన్న కుక్కను చూసి చలించిపోయారు. ఎవరో పెంచుకున్న కుక్క రోడ్డుపైకి వచ్చి, ప్రమాదానికి గురై ఉంటుందని తెలిపారు. చరణ్‌ను స్థానికులు అభినందించారు.

కొత్త రేషన్ డిపోలు వద్దు

మహారాణిపేట: జిల్లాలో కొత్తగా రేషన్ డిపోలు ఏర్పాటు చేయవద్దని, ప్రస్తుతం ఉన్నవే సర్దుబాటు చేయాలని జిల్లా చౌకధరల దుకాణ డీలర్ల సంఘాలు వేర్వేరుగా కోరారు. శుక్రవారం ఈ సంఘాలు జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీఎస్‌వో సూర్యప్రకాశరావుకు వినతి పత్రాలు సమర్పించారు. కొత్తగా 61 డిపోలు ఏర్పాటు చేస్తే తాము ఇబ్బంది పడతామన్న అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టు జిల్లా సంఘం అధ్యక్షుడు పి.చిట్టిరాజు తెలిపారు.

57వ వార్డులో పడకేసిన పారిశుధ్యం



సుభాష్‌నగర్ వంతెన మార్గంలో పేరుకుపోయిన చెత్తాచెదారం

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు ఊర్వశికూడలి, ఐటీఐ జంక్షన్ పరిసరాల్లో పారిశుధ్యం పడకేసింది. సుభాష్‌నగర్ ప్రాథమిక పాఠశాలకు ఆనుకుని ఉన్న గౌరీనగర్, తుమ్మడపాలెం, సుభాష్‌నగర్ రైల్వే వంతెన రహదారుల్లో చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో పేరుకుపోయాయి. ఈ ప్రాంతంలో నెలల తరబడి పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం వల్లే చెత్త పేరుకుపోయి, దుర్గంధం వ్యాపిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎక్కడెక్కడి నుంచే చెత్తను తీసుకొచ్చి, ఇక్కడ పోగేస్తున్నారని చెప్తున్నారు. ఈ మార్గంలో పుష్‌కార్ట్స్, డస్ట్ బిన్లు తుప్పుపట్టడంతో చెత్తచెదారం రోడ్లపై వేస్తున్నారు. సమీప పాఠశాలల విద్యార్థులు, పాదచారులు, రైల్వే డీజిల్ లోకో షెడ్‌లకు వెళ్లే ఉద్యోగులు ముక్కుమూసుకుని మరీ రాకపోకలు సాగించాల్సి వస్తోంది. సచివాలయ శానిటరీ కార్యదర్శులు జాడే కనిపించట్లేదని స్థానికులంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

యునెస్కో సదస్సుకు ఇంటాక్ కన్వీనర్



డా.రాజశేఖర్‌రెడ్డి

సాక్షి, విశాఖపట్నం: యునెస్కో, జీఎస్ఐ సంయుక్తంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సుకు ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చర్ హెరిటేజ్(ఇంటాక్) విశాఖ చాప్టర్ కన్వీనర్, జియో హెరిటేజ్ అడ్వైజ డి.రాజశేఖర్‌రెడ్డికి ఆహ్వానం అందింది. ఢిల్లీలోని యునెస్కో హౌస్‌లో సెప్టెంబర్ 23 నుంచి 26వ తేదీ వరకు 'ఫస్ట్ కెపాసిటీ బిల్డింగ్ ట్రెనింగ్ కమ్ వర్క్‌షాప్ ఆన్ యునెస్కో గ్లోబల్ జియోపార్క్స్'జరగనుంది. ఈ సందర్భంగా జరిగే చర్చావేదికలో జియోపార్క్‌ల మూలాలు అనే అంశంపై ప్రసంగించేందుకు రాజశేఖర్‌రెడ్డికి ఆహ్వానం అందింది. మొదటి రెండు రోజులు వర్క్‌షాప్ జరుగుతుందనీ.. చివరి రోజున రాజస్థాన్‌లో క్షేత్రస్థాయి పర్యటన ఉంటుందని ఆయన తెలిపారు. భారత్‌లో గ్లోబల్ జియోపార్క్‌లు ఏర్పాటు చేసేందుకు యునెస్కో తీసుకుంటున్న చొరవ ప్రశంసనీయమని.. ఈ వర్క్‌షాప్‌కు ఆహ్వానం లభించడం సంతోషంగా ఉందని రాజశేఖర్ రెడ్డి తెలిపారు.

రోడ్డు ఇలా.. వెళ్లేది ఎలా?

- మరమ్మతులతో డాక్‌యార్డ్ వంతెనపై వాహనాలకు బ్రేక్
- చుట్టు తిరిగి వెళ్లలేక ములగాడ మీదుగా రాకపోకలు
- ఈ రోడ్డును బాగుచేయాలంటూ పోర్టు అధికారులకు మొర



బురదమయంగా ఉన్న గుంతల రోడ్డుపైనే వాహనాల రాకపోకలు



పోర్టు అధికారులకు రోడ్డు దుస్థితిని చూపిస్తున్న గ్రామస్తులు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతానికి రాకపోకలు సాగించే వాహనదారులు, పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డాక్‌యార్డ్ వంతెనపై రాకపోకలు నిలిపేయడమే ఇందుకు కారణం. దీంతో చుట్టు తిరిగి 10–15 కి.మీ. వెళ్లలేక.. ఇరుకు రోడ్లను ఆశ్రయిస్తున్నారు. ఉన్న ఒక్క ప్రత్యామ్నాయం ములగాడలోని శ్రావణ్ షిప్పింగ్ రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఛిద్రం కావడంతో వాహనదారులకు ఇక్కట్లు మరింతగా పెరిగాయి.

పారిశ్రామిక ప్రాంతంలో భారీ పరిశ్రమలైన డాక్‌యార్డ్, ఎస్‌బీసీ, ఎస్ఆర్, షిప్‌యార్డ్, హెచ్‌పీసీఎల్, కోరమాండల్ వంటి పరిశ్రమలున్నాయి. ఆయా పరిశ్రమలకు దగ్గరలో నివాసాలున్న వారే కాకుండా, నగర పరిధిలో పలు ప్రాంతాల నుంచి నిత్యం వేల సంఖ్యలో పర్మినెంట్ ఉద్యోగులతోపాటు, కాంట్రాక్ట్ కార్మికులు డాక్‌యార్డ్‌కు సమీపానున్న సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెన ద్వారా రాకపోకలు సాగించేవారు. వంతెన మరమ్మతుల కోసం గత నెల నుంచి ఈ వంతెనపై రాకపోకల్ని నిలిపేశారు. డాక్‌యార్డ్‌కు ఎదురుగానున్న వీడీఆర్ గొడౌన్స్, హెచ్‌పీ ఎల్‌పీజీ టెర్మినల్ మీదుగా సర్కిల్ వద్దనున్న బ్రిడ్జి పైనుంచి వాహనాలను మళ్లించారు. దీంతో నగరం నుంచి వచ్చే వారు, పారిశ్రామిక ప్రాంతం నుంచి నగరానికి వెళ్లాలనుకునే వారు సుమారు 11 నుంచి 14 కిలోమీటర్లు చుట్టూ తిరగాల్సి వస్తోంది. సమయం ఎక్కువ తీసుకోవడంతోపాటు, ఇంధన ఖర్చు కూడా అదనం. ఈ నేపథ్యంలో చాలా మంది వాహనదారులు ములగాడ, శ్రావణ్ షిప్పింగ్ మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు.

ఈ మార్గం ప్రస్తుతం చాలా దారుణంగా ఉంది. ఈ రోడ్డులో నిత్యం వందల సంఖ్యలో శ్రావణ్ షిప్పింగ్ వద్దకు లోడింగ్ కోసం వచ్చే భారీ కంటైనర్లతో రద్దీగా ఉంటుంది. ఇప్పటికే ఈ రోడ్డు భారీ గోతులతో ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు చేరి, చిన్నపాటి చెరువులుగా మారాయి. దీంతో ఈ రోడ్డుపై వెళ్లే వాహనదారులతోపాటు ములగాడ, ఎదురవానిపాలెం, చిన్నములగాడ, గొందేశివానిపాలెం తదితర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఈ నేపథ్యంలో స్థానిక కార్పొరేటర్ గులిగిందల లావణ్య ఆధ్వర్యంలో పోర్టు అధికారులకు సమస్యను విన్నవించారు. స్పందించిన పోర్టు అధికారులు ఏఈ నిరంజన్‌బాబు, ఇతర సిబ్బందితో శుక్రవారం రోడ్లను పరిశీలించారు. గ్రామస్తులతో కలిసి రోడ్డు మీదుగా పలు ప్రాంతాల్లో నడిచి, సమస్య తీవ్రతను గుర్తించారు. ఉన్నతాధికారులకు నివేదించి రోడ్డు మరమ్మతులు చేపట్టి, సమస్యకు పరిష్కారం చూపుతామని భరోసానిచ్చారు.

బెహరా కళాశాలలో పోషకాహార వారోత్సవాలు



బెహరా కళాశాలలో పోషకాహార నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

గోపాలపట్నం: నరవలోని బెహరా కళాశాలలో పోషకాహార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన బెహరా విద్యాసంస్థల సెక్రటరీ బెహరా విజయచైతన్య మట్లాడుతూ పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ప్రస్తుతం ఆహారపు అలవాట్లు మారిపోయాయని ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్‌కు అలవాటు పడటంతో అనారోగ్యాలను కొనితెచ్చుకుంటున్నామని హెచ్చరించారు. బెహరా నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ హిందుమతి ఆధ్వర్యంలో విద్యార్థులు పౌష్టికాహార నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ బాణాల తరుణ్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.